కథా నిలయం
3845
శ్రీకాకుళం

# సింహాసనం

గబ గబా స్ట్రెచర్‌ని ఆపరేషన్ థియేటర్‌లోకి తీసుకు వెళ్ళారు.

స్ట్రెచర్ మీద అప్పారావ్ నీరసంగా మూలుగుతున్నాడు.

అతని మూలుగు భర్త నాలుగు తన్నినా, సిగ్గులేకుండా అతని కాళ్ళు పట్టుకుని, దేబిరిస్తూ ముక్కు చీది పారేస్తున్న తెలుగు సినిమా పతివ్రత హీరోయిన్ మూలుగులా లేదు.

చాలా నీరసంగా ఎన్నో రోజుల క్రితం అన్నం తిన్నవాడు, ఏడుద్దామనుకుని ఏడవలేక

మూలిగినట్టుగా వుంది.

స్ట్రెచర్ ఆపరేషన్ థియేటర్‌లోకి వెళ్ళగానే ఆపరేషన్ థియేటర్ తలుపు మూసుకుంది.

బయట బోర్డు మీద "ఎమర్జెన్సీ ఆపరేషన్ థియేటర్" అని వ్రాసి వుంది.

లోపల ఓ ఇద్దరు డాక్టర్లు, ముగ్గురు నర్సమ్మల సహాయంతో అప్పారావ్ అనబడే కాణీకి ఠికాణా లేని ఆ దౌర్భాగ్యుడి పొట్టను రెండు భాగాలుగా చీలుస్తున్నారు - ఆ పొట్ట ఏనాడూ కడుపు నిండా అన్నానికి నోచుకోని కారణంగా, ఖాళీగా వుంది. అంటే పూర్తిగా ఖాళీగా వుందని కాదు. ఉండవలసిన కండలు, కండరాలూ పెరగవలసినట్టు పెరగనందువల్ల, పులి కోసం కట్టిన బోనులో పిల్లి పిల్లను వదలినట్టుగా వుంది.

ఆపరేషన్ థియేటర్ బయట ఆత్రుతగా నుంచున్న అప్పారావ్ భార్య చూసేవాళ్ళకి ఆమె ఎప్పుడు స్పృహ తప్పి పడిపోతుందా అనేంత కంగారుగా, నీరసంగా వుంది.

లోపల అప్పారావ్‌కి ఆపరేషన్ జరుగుతుంటే, బయట నుంచున్న అప్పారావ్ భార్యకి చెమటలు పోస్తున్నాయి.

గంట గడిచింది.

ఆపరేషన్ థియెటర్ తలుపు తెరుచుకున్నది.

ఒక నర్సు హడావిడిగా బయటకు వచ్చింది.

గాబరాగా చూస్తున్న అప్పారావ్ భార్యను, గమనించి కూడా గమనించనట్టుగా చకచకా, అదే వరండాలో చివరగా వున్న బ్లడ్ బాంక్‌లోకి పరుగెత్తినట్టుగా నడిచింది.

అప్పారావ్ భార్య (మాటిమాటికీ అలా అనటం బోరుగా వుంది. ఇక నుంచీ అలివేలు అందాం) - అలివేలు చటుక్కున అక్కడ వున్న బల్ల మీద కూలబడింది. అలా కూలబడకపోతే, ఇంకో క్షణంలో కళ్ళు తిరిగి క్రింద పడేదన్నమాట తల వంచి, వళ్ళో పెట్టుకుని, మళ్ళీ ఈ లోకంలోకి వద్దామని ప్రయత్నం చేస్తున్నది.

బ్లడ్ బాంక్‌లోకి వెళ్ళిన నర్సమ్మ రక్తం నిండుగా వున్న ఒక సీసాతో బయటకు వచ్చి, ఈసారి నడుస్తున్నంత వేగంగా పరుగెత్తుతూ, మళ్ళీ ఆపరేషన్ థియేటర్‌లోకి దూరింది.

అలివేలు తలెత్తి నర్సమ్మను చూడలేదు కనుక, మళ్ళీ గాబరా పడనవసరం లేకుండా, అలానే కూర్చుని వుంది.

మళ్ళీ ఇంకో గంట గడిచింది.

ఈసారి ఆపరేషన్ థియేటర్ తలుపులు బార్లా తెరుచుకున్నాయి.

డాక్టర్‌గారు టవల్‌తో చేతులు తుడుచుకుంటూ బయటకు వచ్చారు.

అలివేలు లేచి నిలబడింది. చేతి వేలు అసహనంగా నొక్కుకుంటూ "ఎలా వుంది డాక్టరు బాబూ" అన్నది - ఆ మాటలు సరిగ్గా పనిచేయని టెలిఫోన్ రిసీవర్‌లో నించి వచ్చినట్టుగా వున్నాయి.

ఆ డాక్టర్ గారింట్లోనూ టెలిఫోన్ వుంది కనుక, ఆ మాటలు ఆయన ఫాలో

అవగలిగాడు.

''బాగానే వుందమ్మా - ఏమీ ఫరవాలేదు - ఒక సీసా రక్తం కూడా ఎక్కించాం - మత్తు మందు దిగిపోయేదాకా రికవరీ రూంలో అబ్జర్వేషన్‌లో వుంటాడాయన. తర్వాత వార్డులోకి తీసుకెళ్ళవచ్చు''.

ఆయనా మానసిక, శారీరక శ్రమ మీద వున్నాడేమో, బయట వీస్తున్న చల్లని గాలిని గుండె నిండా పీల్చుకుని ముందుకు వెళ్ళిపోయాడు.

అక్కడ చుట్టుప్రక్కల దేవుడి పటాలేంలేవు కనుక, తను నమ్మిన దేవుడికి మనసులోనే దండం పెట్టుకుని, మళ్ళీ కళ్ళు తిరుగుతాయేమోనని భయపడి - ఆ బెంచీ మీద అలానే కూలబడింది అలివేలు.

తర్వాత రెండు గంటలు గడిచాయి.

అప్పారావ్‌కి మత్తు మందు ప్రభావం తగ్గిపోయింది.

కళ్ళు తెరిచాడు.

దాహంగా వుందన్నాడు.

నర్సమ్మ బయటకు వచ్చి, అలివేలును లోపలకు పిల్చుకుపోయింది. అప్పారావ్‌ని అలా చూడగానే అలివేలు కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి.

అప్పారావ్ అనునయంగా ఆమె వేపు చూసి, జీవంలేని నవ్వు నవ్వాడు. నవ్వటం అవగానే, దాహంగా వుందన్నాడు.

అలివేలు 'నా మతి మండిపోనూ' అనుకుంటూ తను తెచ్చిన ఫ్లాస్క్‌లోని కాఫీ లాంటి ద్రవాన్ని, అతని చేత త్రాగించింది.

అప్పారావ్ అది త్రాగి, కళ్ళు మూసుకున్నాడు.

డాక్టర్ వచ్చి అప్పారావ్ నాడి పరీక్షించి ''నౌ హీ యిజ్ ఆల్ రైట్ - నో ప్రాబ్లమ్'' అన్నాడు, అలివేలుతో. అలివేలుకు అతను ఏ భాషలో మాట్లాడేడో కూడా అర్థం కాలేదు. ప్రక్కనేవున్న మలయాళం నర్స్ అతని ఇంగ్లీషుని తెలుగులోకి అనువాదం చేసి, అలివేలుతో చెప్పింది.

డాక్టర్ పోతూ పోతూ మళయాళం నర్స్‌తో - ''ఇతన్ని జనరల్ వార్డ్ బెడ్ నెంబర్ 42కు తీసుకెళ్ళండి'' అని తెలుగులో చెప్పి వెళ్ళిపోయాడు.

అలివేలు, అప్పారావ్‌కు మెడ దాకా కప్పివున్న దుప్పటిని సరిదిద్ది, చెదిరిన అతని జుట్టులోకి చేతులు పోనిచ్చి లాలింపుగా నిమిరింది.

అప్పారావ్ మళ్ళీ మందహాసం చేశాడు. మందహాసం చేయటం అవంగానే దాహంగా వుందన్నాడు.

అలివేలు ఫ్లాస్క్‌లో మిగిలిన కాఫీలాంటి ద్రవాన్ని అతనికి ఇచ్చింది.

ఈలోపల నర్సమ్మ స్ట్రెచర్‌నూ, దాన్ని మోసే మనుషులనూ వెంటబెట్టుకు వచ్చింది.

నర్సమ్మ అప్పారావ్‌తో నెమ్మదిగా అన్నది - "జనరల్ వార్డులో 42 నెంబర్ బెడ్ యిచ్చారు. మిమ్మల్నక్కడకు తీసుకువెళ్ళటానికే ఈ స్ట్రెచర్ తెచ్చింది."

అప్పారావ్ ఎందుకో ఒక్కసారిగా ఉలిక్కిపడ్డాడు.

"నేను రాను!" అన్నాడు.

అలివేలు, నర్సమ్మ, స్ట్రెచరూ, దాన్ని మోసుకుపోవటానికి వచ్చిన మనుషుల్లాంటి వాళ్ళూ అందరూ ఆశ్చర్యపోయారు. ఎవళ్ళ ముక్కుల మీద వాళ్ళ వేళ్ళు వేసుకున్నారు.

"అక్కడ మంచి బెడ్, అదీ వున్నది. ఇది రికవరీ రూమ్. ఇక్కడ ఎక్కువ సేపు వుండకూడదు!" అన్నది నర్సమ్మ మళ్ళీ.

"నేను రాను" అన్నాడు అప్పారావ్ ధృడంగా.

"ఎందుకని?"

"నేను ఈ మంచం వదిలి రాను."

"ఎందుకని?" నర్సమ్మ ఈసారి గద్దించి అడిగింది.

"నేను రాను - అంతే" అప్పారావ్ మంచాన్ని రెండు చేతులతో గట్టిగా పట్టుకుంటూ అన్నాడు.

అలివేలు అన్నది - "ఇక్కడ వుండకూడదుటండీ - ఆ వార్డుకు పోదాం - అక్కడా బాగానే వుంటుంది కదా."

"నేను రాననీ చెబుతే నీక్కాదు. నేను ఈ మంచం దిగను అంతే!" మొండిగా అన్నాడు అప్పారావ్.

అక్కడవున్న అందరికీ అదో వింతలా అనిపించింది. నెమ్మదిగా, అణుకువగా వుండే అప్పారావ్ ఎందుకు ఇంత గట్టిగా మంచం దిగనని చెబుతున్నాడు?

ఈలోపల స్ట్రెచర్ మోసే మహానుభావుల్లో ఒక మహాశయుడు డాక్టర్ గారిని పిలుచుకువచ్చాడు.

డాక్టర్ వచ్చి, "ఇదుగో అప్పారావ్ - ఏమిటా మాటలు - నిన్నేం బయట పారేయటంలేదుకదా - వార్డులోని బెడ్‌కి పొమ్మంటున్నాం. దీనికోసం అంత మెండికేస్తే ఎలా? - ఎవరన్నా వింటే నవ్వుతారు. నువ్వు నడవనవసరం కూడా లేకుండా వాళ్ళే మోసుకుపోతారు. వెళ్ళు వెళ్ళు వార్డులోకి!" అన్నాడు.

అప్పారావ్, "నేను వెళ్ళను. నేను ఈ బెడ్ దిగను" అన్నాడు. అనటం అవగానే దాహం వేస్తున్నది అన్నాడు.

అలివేలు ఫ్లాస్కులో ఏమీ లేనందువల్ల, ప్రక్కన వున్న కూజాలోని నీళ్ళు అందించింది.

అవి త్రాగి "నేను ఈ బెడ్ దిగను" అన్నాడు అప్పారావ్ మళ్ళీ.

డాక్టర్ మళ్ళీ నచ్చజెప్పబోయాడు.

అప్పారావ్ వినలేదు. "ససేమిరా" అన్నాడు.

"ససేమిరా అంటే ఏమిటి?" అని గోడ మీద వున్న చిన్న బల్లి పెద్ద బల్లిని అడిగింది.

"ష్! గోల చేయకుండా విను" కసిరింది పెద్ద బల్లి.

ఈలోగా ఇద్దరు తోటీలు బలవంతంగా అప్పారావ్‌ను మంచం మీద నుంచి దించబోయారు. అతను మంచం మీద నుంచి చచ్చినా దిగనన్నాడు. మంచాన్ని గట్టిగా రెండు చేతులతో పట్టుకున్నాడు.

"దిగను కాక, దిగను కాక, దిగను కాక దిగను" అన్నాడు.

డాక్టర్‌గారికి అతని మనస్తత్వం ఆశ్చర్యంగా వుంది. ఏమిటీ ఇలా అంటున్నాడీ అర్భకుడు. ఇతనిలో ఇంత పట్టుదల ఎక్కడ నుంచి వచ్చింది? ఆపరేషన్‌లో ఏదయినా పొరపాటయిందా? ఏమీ అర్థం కాక జుట్టు పీక్కున్నాడు డాక్టర్‌గారు.

కిసుక్కున నవ్వింది, గోడ మీద చిన్న బల్లి.

పెద్ద బల్లి కూడా నవ్వి " అప్పారావ్ అలా ఎందుకు చేస్తున్నదీ నాకు తెలుసు!" అన్నది.

"అయితే మరి ఆ సంగతేదో చెప్పి, పుణ్యం కట్టుకుందూ" అని బ్రతిమిలాడింది చిన్నబల్లి.

"చెబుతాను. నిశ్శబ్దంగా విను. అప్పారావ్ స్వతహాగా అలాటివాడు కాకపోయినా, ఆపరేషన్ తర్వాత అంత పట్టుదలగా ఆ మంచం దిగననటం, మాటి మాటికీ దాహం , దాహం అనటం ఎందుకంటే - అప్పారావ్‌లోని రక్తం అంతా అతనిదే కాదు -ఇందాక ఆపరేషన్ అవగానే ఒక సీసాడు రక్తం ఎక్కించారు చూశావ్ కదా. ఆ రక్తం ఒక పెద్ద మనిషిది. ఆయన ఈ వూరి మునిసిపల్ ఛైర్మన్. ఆయన జీవితంలో ముఖ్యమైన పాత్ర వహించేవి రెండే - ఒకటి పదవి, రెండు దాహం - అంటే డబ్బు దాహం. ఆయన ప్రాణాలయినా ఇస్తాడు గాని పదవి మాత్రం వదలడు. సింహాసనం దిగనంటాడు. మధ్య మధ్యలో దాహం, దాహం అంటుంటాడు. ఆయన రక్తం ఇతనికి ఎక్కించటంతో, ఇతను కూడా తానెక్కిన మంచం దిగనంటాడు. దిగనుకాక దిగనుకాక దిగనంటాడు. మధ్యమధ్యలో దాహం, దాహం అంటాడు. అదీ కథ" పెద్ద బల్లి చెప్పటం ఆపింది.

"నువ్వు చెప్పింది చాల వింతగా వుంది. అలాటి పెద్ద మనిషి అసలు ఈ హాస్పిటల్‌కి రక్తదానం ఎలా చేశాడంటావ్?" దర్శకలోపం పట్టుకున్న సినిమా ప్రేక్షకుడిలా అడిగింది చిన్న బల్లి.

పెద్ద బల్లి పెద్దగా నవ్వి " ఆ మధ్య మంత్రి గారు ఈ బ్లడ్‌బాంక్‌ను ప్రారంభంచేసి, తనూ కొంత రక్తదానం చేశారు. మంత్రిగారే రక్తదానం చేయగా, తను చేయకపోతే చులకనగా వుంటుందనీ, అదీకాక తన దేశభక్తినీ కొంచెం చూపించినట్టు వుంటుందనీ, పెద్ద ఆలోచన చేసిన తర్వాతనే - ఛైర్మన్‌గారు రక్తం దానం చేశారు."

చిన్న బల్లి ఆశ్చర్యపడబోయి, గోడ మీద నుంచి క్రింద పడతానేమోనని భయపడి, ఆశ్చర్యపడటం మానేసింది.